# అందాలవేట

అందచందాలు పుట్టుకతో రావాలిగాని కొనుక్కుంటేనూ, అంటించుకుంటేనూ వస్తాయా అంటూంటారు పెద్దవాళ్ళు. ఇందులోని సత్యాన్ని యేనాడో కాదంది మన ప్రపంచం.

అందంగా కనుపించ దలచుకున్న వాళ్ళకి అందచందా లక్కర్లేదు. పుట్టుకతోనే పెన్నెంతీగలకుమల్లే ప్రకాశించ నక్కర్లేదు.

అందమంటే నలుగురిలోనూ రాణింపు - కాస్త నిగనిగ - కొంచం తళ్ళుకూ, బెళుకూ. పుట్టుకతో వచ్చేది శరీరమూ, అవయవాలున్నూ: అందం కాదు. అందమనేది ఆ శరీరంమీదా, అవయవాలమీదా కాలక్రమేణా తీర్చి, దిద్దుకుంటూండాల్సిన తీరు.

అందమైన అమ్మలక్కలు పుట్టరు - పుట్టిన పిమ్మట రత్నాలకు మల్లే సాన పెట్ట బడతారు. ఇదీ అందాల తీరు.

మీరు అందంగా పుట్టలేదనీ, మీ మూతి కోతిమూతిలా వుంటుందనీ, మీ రూపం దుమ్ములగొండిని పోలివుంటుందనీ మీరు చిన్నబుచ్చుకో నక్కర్లేదు.

మీకు అందం కావల్సిన వయస్సు వచ్చేసరికి దాన్ని మీరు బజారుకువెళ్ళి అంగడిపుచ్చుకున్నట్టుగా రూపాయి అణా పైసలతో కొనుక్కో వచ్చును - మీ నాన్న చుట్టలు కొనుక్కుట్టుగానూ, మీ అన్న కిళ్ళీ కొనుక్కున్నట్టుగానూ, మీరు పలకలూ, పలకపుల్లలూ కొనుక్కున్నట్టుగానూ. మీకు కావలసినప్పుడు అందాన్నే ఇవ్వలేకపోతే ఎందుకూ ఈ నాగరికతలూ, విజ్ఞానాలూ, పరిశోధనలూ, ఇవన్నీను!

అందం ముఖ్యంగా కావల్సింది ఆడవారికి. ఎందుకని నన్ను అడక్కండి. ఈ అందమనేది ప్రతి చిన్నదానికీ పది సంవత్సరాలు పైబడిన దగ్గర్నుంచీ అవసరమై, ఆపైన సర్వీసులోవున్న ఉద్యోగికిమల్లే ఏళ్ళు గడచినకొద్దీ ప్రమోషన్ కోరుతుంది.

పది సంవత్సరాల లోపు పిల్లలైతే చీమిడిముక్కుతో వున్నా, మాసినపరికిణీ కట్టుకున్నా లక్ష్యపెట్టేవారు అరుదుగా వుంటారు. కాని, ఆపైన అలాగ వుండడానికి వీల్లేదు. అందాలవేటకు బయల్దేరాలి.

ఎందుకు బయల్దేరాలో మీరు అడగవలసింది నన్ను కాదు!

యం. యస్. మూర్తి

అందమనేది ఈ రోజున ముఖ్యంగా కట్టుబట్టమీద ఆధారపడివుంది. రోజుకి ఎన్ని చీరలు, ఎన్నెన్నిరకాలచీరలు కట్టి విడుస్తూంటే అంత అందం మీ పాల బడుతుంది. అంత ఆకర్షణ మీచేతి సొమ్ము. అందమైన చీర కట్టికూడా ఈ రోజుల్లో పరాఙ్ముఖాలను తనవైపుకు త్రిప్పించుకోలేని స్త్రీకి కాల్చినా అందంరాదు.

మీకు అందం లేదని నిరుత్సాహ పడకండి. వెంటనే మీకు సమీపంలో వుండే చీరల స్పెషలిస్టులవద్దకు వెళ్ళండి మీ ముఖం చూడ్డంతోనే మీకు అందానిచ్చే చీర ఎటువంటి దయ్యుంటుందో వారు గ్రహించి, దాన్ని మీకు చుట్టబెట్టి మిమ్మల్ని సర్వాంగసుందరంగా తయారు చేసి పంపిస్తారు. మళ్ళీ మళ్ళీ వాళ్ళదగ్గరకు వెళ్ళి కనుక్కుంటూంటే ఎప్పుడు ఏయే కొత్తరకాలు వచ్చాయో అవన్నీ మీకు చూపిస్తూ, మీ అందానికి కొత్త మెరుగులు పెడుతూంటారు.

చీరలద్వారా మీరు సంపాయించుకున్న అందానికి తోడు కొన్ని ఆభరణాలు కూడా వుంటే బంగారానికి తావి అబ్బినట్టుగా వుంటుంది.

భయపడకండి. గంగిరెద్దులకు మల్లే కాసులపేర్లూ, మొహిరీలూ మీరు మొయ్యనక్కర్లేదు. అటువంటి సలహా మీరు కోరినా ఎవరూ ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఈ రోజుల్లో, పోతే, ఒకపేట చెయినూ, చెవులకు లోలకు - కాదు - ఇప్పుడొస్తూండే కొత్తరకపు జూకాలూ, చేతులకు రెండు జతల గాజులూ - లోహపువి ఏలోహపువైనా సరే.

చేతులకు రెండు జతల లోహపు గాజులు చాలును. ఆపైన ఒక పాతిక జతల గాజుగాజులు - గ్లాస్ బ్యాంగిల్సు - అంటారు వీటినే కాబోలు. ఇవి చేతి మణికట్టు దగ్గర్నుంచి మోచేతివరకూ వుంటే మీ చేతులు ఎంతైనా రాణిస్తాయి.

మోచేతివరకూ గాజులు వేసుకోడానికి ఈ రోజుల్లో కడుపుతో వుండనక్కర్లేదు. అందుచేత అటువంటి భీతిని విడవండి.

అయితే ఒక్కమాట -

ఈ గాజులు మాత్రం గాజులమల్లారంలో కొనకండి. గాజులవాడిముందు కూర్చుని వాడు వేసే గాజులు తొడుక్కోవడమంత చిన్నతనం వేరేలేదు. ఈరోజుల్లో షాపుల్లోకి వెళ్ళండి-అక్కడ కొత్తరకం సరుకుంది-గాజులవాడు ఒక గాజు అర్థణాకిస్తే, షాపులో ఒక అర్థరూపాయి - అయితేనేంగాక!

చేతికి రిస్టువాచీ, కళ్ళకు జోడూ ఈ రోజుల్లో అందాన్నివ్వడం మానుకున్నాయి. కాని, చేతిలో ఒక వేనిటీ బేగ్, కాలికి శాండల్సు ఇంకా మోజులోంచి తప్పుకోలేదు. పౌడరు ఫరవాలేదు.

వీలైతే నఖాలు ఎప్పటికప్పుడు 'క్లిప్' చేయడం, ఎర్రరంగు పూయడం,

కళ్ళకు లేతగా కాటుకొకటి – ఇప్పుడు మీ అందాల సంచిలో వుండితీరాలి. ఇది ప్రచారంలో వుంది.

కేశ సౌభాగ్యమే వుంటే అందం లేదని మీరు జడవ నక్కర్లేదు. అందం లేని లోటును దీర్ఘమైన జడలు కప్పి పుచ్చుతాయి. ఒక నిండైన జడ ఎంతో అందాన్నిస్తుంది. రెండుజడలు మరీ అందాన్నిస్తాయి. మూడుజడలు ఇంకా ఇంకా అందాన్నిస్తాయి.

జడలు మీ యిష్టమొచ్చినంత పొడుగ్గా పెంచండి. ఎంత పొడుగుంటే అంత అందం, అంత ప్రయోజనం – అవసరమొస్తే పొడుగైన, త్రాచు పాముల్లాంటి జడలతో మీ ప్రియులను బంధించవచ్చు, వారి మెడకు ఉరిపెట్టవచ్చు .....

కొందరికి పాపం కేశసౌభాగ్యం చాలినంత, కోరినంత వుండదు–ఏ 'రీటా' వాడినాకూడా వాటికి సత్తువ రాకపోతే, అవి ఎదగకపోతే – మీరు ముఖం అలా పెట్టుకొని యిదవనక్కర్లేదు ఎలకతోకంత జడను వేసుకుని దాని వీపుమీద వుండే పమిటచెంగుచాటున దాచుకోండి. ఇలా అయితే జడ ఉన్నట్టూ తెలుతుంది, అదొక ఫ్యాషన్‌లాగా వుంటుంది.

అక్కడికీ మీకు తృప్తిలేకపోతే, ఇంకా పొడుగైన – రోడ్డు తుడవడానికి వీలైనంత జడ కావలిస్తే–ఇలా అంటున్నానని కోపించకండి–పొడుగాటి రెడీ–మేడ్ కేశ సముదాయాన్ని కొనుక్కుని, దాన్ని ఎలాగో మీ కాస్త జుట్టుకూ ముడిపెట్టి వ్రేలాడేట్టు చేయండి – అది నిజంగా మీ తలలోంచి పుట్టుకొచ్చిన కేశ సంపదా, కృత్రిమ సముదాయమా అని ఎవ్వరూ శంకించరు. అలా శంకించడం, శంకించినా 'ఇదేమి' టని అడగడం శిష్టసంఘంలో ఆచారం కాదు...

ఇంకేమిటి?

ఇవన్నీ వుండీకూడా మీరు అందంగా వుండటానికి ప్రయత్నించాలి – అంటే వీటిని అవకాశం దొరికినప్పుడల్లా పబ్లికులో ప్రదర్శిస్తూండాలి – ఎప్పటికప్పుడు మీరు 'అందంగా వున్నాను' అనే విషయాన్ని స్ఫురణకు తెచ్చుకుంటూ, దాన్ని మరవకుండా వుండటానికి ప్రయత్నిస్తూ, మిమ్మల్ని చూచే వారిలో కూడా 'ఈవిడ అందమైనదే – అందంగా కనుపించడానికి ప్రయత్నించేదే' అనే భావాన్ని కలిగించడానికి ప్రయత్నించండి – లేకపోతే మీ ప్రయత్నాలన్నీ బుగ్గి!